# పరీక్ష

''కాశీనాథ్''
(జాతీయ రచనామండలి)

విద్యకు అదే మొదటిసారి తన భర్తను చూడడం. పెండ్లి అయినప్పటినుంచీ తన కిష్టంలేని భర్తకనక అలాగు సత్యాగ్రహ దీక్ష పూనివుంటుంది. వీరేశానికిమట్టుకు తనభార్యను వోసారి గాఢాలింగనంలోచేర్చు కోవాలనే ఆశవున్నమాట వాస్తవం. మగాడికి అంతఆశ ఆలోచన వుంటూన్నప్పుడు నిస్సహాయ విద్య యెలా తప్పించుకుపోతుంది? ఎంతకాలం తెరచాటున-తలపూ-వలపూ సోకకుండావుంటుంది? నేటికి విద్యలో పరివర్తనకలిగింది. ప్రథమంలో తన భర్తను గురించి యింట్లో యేమి హేళనలు చెప్పికున్నా విద్యకూడా వారికి తాళంవేసేది. అప్పుడు మేమూ వాళ్ళంతా వీరేశాన్ని తలచి జాలిపడేవాళ్లం.

కాలచక్రపు కదలికలో విద్యలోకూడా కొంత చైతన్యం కలిగింది. ఇదివరకుమల్లే తన భర్తను ఏవగించుకుని చెప్పేమాటల్లో కలిసిరావడం తగ్గించింది. క్రమేణా తన భర్తపై పల్లెత్తుమాటైనా రాలనీయకుండా కల్పించికుని పోట్లాడడం మొదలుపెట్టింది విద్య. నేనోసారి బావవరసలో 'నీ మొగుడు పేడిమూతివాడుకదూ విద్యా! ఎలా కాపురంచేస్తావే!'' అనేసరికి బావననే మర్యాదనైనా మిగిలించకుండా అమాంతం నామీద విరుచుకుపడి ''నీవే పేడిమూతివాడివి. ఆయనని అనుకునేవాళ్ళే రోగ్స్-'' అంటూ వో పూటల్లా నన్ను అల్లరిచేసింది. అప్పుడే నిండిన విద్య తనూలాలిత్యాన్ని, యవ్వన సౌరభనూ వర్ణించుకుని-''పాపం! దీనికూడా మగడుకావాలేమో''ననిపించింది.

నిజానికి చిన్నతనంలో విద్యకు నామీదుండే అభిమానమూ, ఆదరణా, రాను రాను సన్నగిలిపోతున్నాయని చెప్పాలిసొస్తోంది. ఐతే వీరేశానికన్న నేను అందములో తీసిపొయ్యానా? లేక ఆ పొడుగైన నల్లని నీగ్రో దేహంలో తీసిపోతానా! అనిపించింది.

ఐతే విద్య స్నేహితురాలు 'శాంత' వీరేశాన్ని బాగా పొగిడేదని కర్ణాకర్ణిగా విన్నా. అంచేత విద్య భర్తయందిష్టంగా మారిందేమోననిపించింది. అంచేతనే వీరేశం యీ మొదటిసారి కనుపించి ఆమెను నిలబెట్టినా-చిరునవ్వుతో ఆ నల్లని బలిష్ట కాయాన్ని పరీక్షిస్తూ తలుపుప్రక్కన నిలబడివుంది. ఈ చిలుకా, చింపంజీ డైలాగు దృశ్యాన్ని చూచేసరికి నాకోవిధమైన జాలి కలిగింది. బంగారుతీగవంటి విద్య-ఆ నీగ్రో జాతివానితో కాపురం చేయాలిసొచ్చింది కదా! అని. పోనీ, అతగాడేమైనా మంచివాడా అంటే-అదీ శూన్యమే. అతడోశుద్ధ జారాగ్రేసర చక్రవర్తని ఆ యిరుగుపొరుగు కంతటా తెలుసు. విద్యకుమాత్రం తెలీదా అనుకున్నా. నిజంగా విద్యకు తెలిస్తే భర్త పలుకరించకనే నిలబడి అతన్ని దూషించకుండా చిరునవ్వుతో అమాయకంగా వుంటుందా! అలా తెలసివుండేది-వో పతివ్రత అయివుండాలి. ఐతే విద్య పతివ్రత అయ్యేందుకు వీలులేదు. పతివ్రతే అయితే 'శైవ్య

సారస్వతాన్ని' పోషించి వాకిలిముందుకు వచ్చిన ప్రతి మొగాడితో 'నమస్తే మహాశయా!' అని జవాబిస్తుంటుందా! అంచేత శుద్ధ పతివ్రతకాదని నిర్ణయించొచ్చు. అంచేత పత్నీవ్రతా, పతివ్రతలకు జోడు కుదిరిందని సిద్ధాంతీకరించుకున్నా!

తొలిసారి కలిసికున్న ఈ వింత ప్రేమికులను స్టడీచేయాలన్న ఆదుర్దా నాలో బయల్దేరింది.

"ఎన్నాళ్ళకు అగుపించావ్ విద్యా!" అనడం విన్నా!

విద్య తిట్టుకుంటూ యింటిలోనికి పరిగెత్తటం-క్రోధంతో వెలవెలపారిన ముఖంతో వీరేశం ద్వారంగుండా వెలువడడం ఒకేసారి చూచేసరికి ఆ దృశ్యం పూర్తిగా తెలుసుకోవాలనే కోరిక నాలో తీవ్రంగా పెరిగింది.

విద్యనడిగితే సిగ్గుతో చెప్పనేచెప్పదు. వీరేశాన్ని ఏ మొహంపెట్టుకుని అడగను! అప్పటికే అతగాడికి నామీద విద్యను—ప్రేమిస్తున్నాననే నిందను మోపాడు. ఇంకపైన 'మీబావ నీతో బాగా చనువుగా వుంటాడుటగా' అని అంటూన్న ఆఖరిపదం నా చెవినిపడింది. వీరేశం కంటపడకుండా గోడప్రక్కనుంచే దొడ్డిదారిన మందిరాన్ని చేరుకున్నా. నిరాశతో వీరేశం స్వగ్రామానికి తరలిపొయ్యాడు.

అది వెన్నెలతోనిండిన ఒక వసంత రాత్రి. కన్నెకోయిల కూజితంలో శ్రుతి కొలిపే మురళీనాదం పెండ్లిపందిరనుంచి వినబడుతూంది. అందరూ తలో చెయ్యివేసి పంచుకుని-ఆ పెండ్లి హడావిడిలోవున్న సమయం అది. విద్య వంటరిగా ఓ మంచంపై వ్రాలి వుంది మందిరంలో. ఆ నిద్దురించే విద్యవైపుకు వెళ్ళాను ఆశాజ్యోతితో-ఆమెకు స్పర్శతగిలిన క్షణంలోనే-నాకో చెంపకాయ బహుమతి ప్రసాదించి మరీ పారిపోతూంది విద్య..."క్షమించువిద్యా అని చేయి పట్టుకున్నా వినక సమూహంలో కలసిపోయింది. మతిచెడిన నాకు విశ్రాంతితో నిద్దుర కలసి వచ్చింది.

మాఘమాసపు తొలి పౌర్ణమిరోజులలో —విద్య సంసారసాగరంలో పడనున్నదని నాకు తెలుసు. విద్య చాల సంతోషంతో వున్నట్టు గ్రహించా. అనుకున్న లగ్నానికి వీరేశం రాలేదు. కొంతసేపటికి వీరేశం పోయినాడని వార్త. ఊరంతా విచార పడ్డారు.

ఆ మర్నాడు రాత్రి పన్నెండుగంటలయింది. నేనాపన్నాగాన్ని ఆనందించుకునే సమయంలో విద్యవచ్చి నా ప్రక్క నిలబడి వుంది......

"బావా! క్షమించు" అంది తడబడిన గొంతుకను సవరించుకుంటూ.

"విద్యా! అడరాధిని నేను—నువ్వు క్షమించాలి. వీరేశం సుఖంగనే వున్నాడు. నీ బావచేసింది పరీక్ష అని తెలిసికో" అన్నానవ్వుతూ!

"ఆ" అంటూ నిర్ఘాంతపోయింది విద్య.

"విద్యా! ఎవరిభర్త వారికి మొక్కవని నాకూ తెలుసు. చెక్కుచెదరని హృదయం నీదిసుమా!" అన్నా నవ్వుతూ.